కాఫీ

పురాణం కుమారరాఘవశాస్త్రి గారు బి. ఏ.

ప్రతిరోజూ చూస్తున్నానుకదా! నేను మధ్యాహ్నం స్కూలునుంచి ఎఱ్ఱనెండలో దేవుడా అంటూ ఇంటికి నడిచివస్తే తలుపు బిడాయించి వుంటుంది. లోపల రాణీగారు గుఱ్ఱుతీస్తుంటుంది. నేను బయట నిల్చుని "లీలా! లీలా!" అంటూ ఓగంటసేపు తలుపు దగ్గర పాట పాడగా పాడగా "అబ్బ! ఏంగోలచేస్తారండీ!"అని గొణుగుతూ, కళ్లు నులుముకుంటూ, నిద్ర మత్తుమీద పడుతూ, లేస్తూ వచ్చి తలుపుతీస్తుంది. తీసిందే తడవుగా మళ్లీ యథాక్రమంగా పడుకుని ముసుగెట్టుకుంటుంది. ఇంతనిద్ర మత్తుఅయితే ఎలా గబ్బా మరీను.

సాధారణంగా నేను మధ్యాహ్నంఎందుకు వస్తానంటే ఏదో ఇంట్లో కాఫీగట్రా చేస్తుందేమో, ఇంజన్‌లో కాస్త బొగ్గేసి మరీ పోదామని వుద్దేశం. లేకపోతే ప్రొద్దున పదిగంటలకు నాలుగు మెతుకులు తిని పోయి సాయంత్రంవరకూ ఉండలేనుగా. అందులో గుండెలుకరగేటట్లు స్కూళ్లో పిల్లలకు బోధ చేయవలసినపని ఒకటి, జాగ్రఫీమాస్టరునుగదూ హైస్కూలులో.

నేనింటికి వచ్చేసరికి లీల ఈవిధంగా నిద్రమత్తు చూపిస్తుంటే నాకుమరీ రానురాను కోపం ఎక్కువౌతున్నది. ఎన్నాళ్లని సహిస్తాను. ఒకరోజా! రెండురోజులా! రోజూ ఇదే వరసైపోయె. నేనాపాటికి వస్తానని తెలుసుకదా! కాస్త ఫలహారంచేసి, ఇన్నికాఫీనీళ్ళుకాచి వుంచకూడదూ! దున్నపోతులాగా నిద్రపోకపోతే.

పాపంగదా అని నేను చనువు చూపించినకొద్దీ దానికి నిర్లక్ష్యం బలిసిపోయింది. ఎంతసేపటికీ ఆడదాన్ని కాళ్ళ రాయ్యాలండీ అంటారు కొంతమంది. ఆమాటలునాకు రుచించవుగాని కొంతవరకు సత్యముందేమోనని అనుమానపడతాను అప్పుడప్పుడు.

వచ్చిన అవస్థఏమిటయ్యాఅంటే నేను దాన్ని మందలించడానికికూడా వీల్లేకుండా వచ్చింది. కారణమేమంటే— మేమొకరియింట్లో దక్షిణభాగంలో అద్దెకు కాపురమున్నాం. అవతలిభాగంలో ఇంటివారున్నారు. ఆయింటిఆవిడ పెద్దముత్తైదువ. మాయిద్దరికలహాల్లో అనవసరంగా జోక్యం కలిగించుకుంటుంది. నేనెప్పుడైనా లీలను కోపంచేస్తుంటే ఆమె దుడదుడా దానికి వత్తాసివచ్చి నన్నంటుందిగదా! 'అబ్బాయీ! ఆ అమ్మాయి నెందుకు కోపపడతావూ?. చిన్నపిల్ల. కాపురానికివచ్చి ఏడాదైనా కాలేదు సరిగ్గా. ఏదైనా దానివల్ల తప్పువస్తే మగవాడివి నీవే సర్దుకుపోవాలి." అంటుంది. ఈవిడవత్తాసి చూచుకుని మరింత నిర్లక్ష్యం జాస్తిఅయింది లీలకు. కూరల్లోమరి కాస్త వుప్పువేయడం సాగించింది. బడివేళకు వంట కావడములేదు. నాగదిలో నేను కాల్చి పారవేసిన సిగరెట్టుముక్కలసంఖ్య ఎక్కువౌతున్నది; ఎప్పుడైనా ఊడ్పించినపాపాన పోతేనా మరి!

ఇన్నితప్పులూ క్షమించేస్తాను లీలగనుక నేను మధ్యాహ్నం స్కూలునుంచిరాగానే తాను కాఫీచేసివుంచిందంటే. కాని అదిలేదుగా! ప్రతిరోజూ చచ్చినట్లు నేనే చేసుకోనేవాణ్ణి కాఫీ అప్పటికప్పుడు. పైగా ఇంకోతమాషా. ఇంత కష్టపడి నేను కాఫీచేసుకుంటూనా! చివరకు చల్లారపోసే సమయానికి నిద్ర ఎక్కడకుపోతుందో చల్లగావచ్చి దగ్గరకూర్చుంటుంది తనభాగంకోసం చిలిపినవ్వు నవ్వుకుంటూ. పాపంగదాఅని ఒకగిన్నెడు దానిముఖాన పోసి మిగతాది నేను తాగి స్కూలుకుపోతా. ఇదీ రోజూ జరిగేఘట్టం.

నాకీస్కూలుమాస్టరీవుద్యోగం దొరికిన ఆరునెల్లనుంచీ ఇదేవిధంగా రోజూ కాఫీ చేయడంలో 'ప్రొఫెసర్'నైపోయాను. ఐనా నన్నొక అభిమానం బాధిస్తూనేవున్నది. ఇవ్వాళ కాఫీచేసుకోటంతోనే సరిపోయింది. రేపు వంటకూడా చేయలేనని పడుకుంటుంది. దేవుడాఅంటూ చేసుకోవాలిసిందేనా?. ఇంకా నాలుగురోజులుపోతే "నావిస్టల్లోకూడా

కాస్త వడ్డించి మరీ మీరు భోజనం చేయండి" అంటుంది. ఏముందీ! స్త్రీకి అలుసిచ్చినకొద్దీ నెత్తికెక్కి కూర్చునే ప్రకృతిలాగుంది. నాకేమీ పాలుపోవడంలేదు. ఒకనాడు స్కూలునుంచి మధ్యాహ్నం ఇంటికివస్తూ ఆలోచించుకున్నాను: "ఛా! ఛా! భార్యను లొంగదీసుకోలేని నాబ్రతుకంతా నీచమైపోతున్నది. ఇంకా ఈనాఅసమర్థత బడిపిల్లల కెవరికీ తెలియకపోవడంచేత డాబుసరితో మర్యాద నిలబెట్టుకుంటున్నాను. వాళ్లకుగనుక తెలిసెనా, నాబ్రతుకు స్కూల్లో, బయటాకూడా కడిగిపోస్తారు; ఏకేస్తారు దూదిపింజలాగా." ఇంకా ఏమేమో ఆలోచించుకున్నాను. చివరకు తేలిందేమంటే "ఇకనుంచి ఈజన్మలో ఎప్పుడూ కుంపటి రాజేసి నేను కాఫీచేయను" అని నిశ్చయించుకున్నాను.

తిన్నగా ఇంటికిపోయి తలుపుతట్టాను. కొంతసేపటికి తలుపులు తెరుచుకున్నవి. నాముఖంలో ఒక గంభీరత తెచ్చిపెట్టుకున్నాను. ఐనా లాభంలేకపోయింది. లీల నాముఖం వేపు చూస్తేగా. తలుపు తీసింది. మళ్లీవెళ్లి గాఢనిద్రలో మునిగిపోయింది.

నాకేమీ తోచడములేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అక్కడ ఒక గూట్లో ప్రొద్దున కాఫీచేసుకోగా మిగిలినపాలు పోసివున్న వెండిగ్లాసు యధాస్థానంలోవుంది. అక్కడే ఆమూల సగానికిబొగ్గులు పోసివున్న కుంపటి చిరకాల స్నేహభావంతో నన్నాహ్వానిస్తున్నట్లు కనుపిస్తున్నది. అక్కడ ముక్కాలిపీటమీది మామిడికాయమార్కు అగ్గిపెట్టెకూడా నాదృక్పథం తప్పించుకునిపోలేదు.

ఎలాగాఇప్పుడు లీలనులేపి కాఫీచేయించడం?. గుఱ్ఱుకూడా తీస్తున్నదిసన్నగా. నాప్రయోజకత్వం పరీక్షచేసేసమయం అది. లీలనులేపి కాఫీచేయమని డబాయిద్దామాఅంటే ఒకవేళ అది నిద్రమత్తుమీద విసుక్కొని లేవకపోతే యధాప్రకారంగా నేనే చేసుకోవలసి వస్తుందేమో. అదిమరీ అవమానకరమైంది. కనుక కిక్కురుమనకుండా రోజుకుమల్లే నేనే కుంపటి రాజేసుకుంటే బాగుండేలాగుంది.

కుంపటి అంటించుకున్నాను నేనే. డికాక్షన్ నీళ్లు కాగుతున్నవి. నేను అటూ, ఇటూ పచారుచేస్తున్నాను సాయంత్రం నాల్గవఫారం వాళ్లకు చెప్పవలసిన జాగ్రఫీపాఠం నెమరుకు తెచ్చుకుంటూ. డికాక్షన్ నీళ్ళు సలసలాకాగినై. నేను చప్పుడుకాకుండా దొంగతనంగా వంటయింట్లో పాలుత్రాగబోయే మార్జాలంలాగా అడుగలు వేసుకుంటూపోయి లీల మెడలో మంగళసూత్రానికి కట్టివున్న తాళపుచెవి విప్పుకుని పెట్టెతీసి అందులోవున్న కాఫీపొడుం డబ్బా తెచ్చుకున్నాను. లీలకు నిద్రాభంగం కాకుండా జాగ్రత్తపడ్డాను.

కాఫీ తయారైంది దేవలోకంలో అమృతంలాగా. ఇక చల్లార్చుకోవాలి. ఒకగిన్నెలోంచి మరోగిన్నెలోకి ఎత్తిపోస్తూ చల్లార్చటం మొదలెట్టేనంటే చప్పుడౌతుంది. చప్పుడౌతే లీలకు మెలకువ వస్తుందేమో. ఇప్పుడు దాన్ని లేపకూడదు. తగినశాస్తి చేయాలి. ఈ కాఫీలో ఒక్కచుక్కకూడా దానికివ్వను. విసనకఱ్ఱతో విసురుతూ కాఫీ చల్లార్చుకుంటున్నా.

నిజంగా కాఫీయొక్క ఆమనోహరమైన రంగులోనేవుంది కొంతమజా. అందుకనే కాఫీరంగు చీరలంటే ఆడవాళ్లకు చాలాయిష్టం. రంగుకేంగాని నేనిప్పుడు తయారుచేసిన కాఫీయొక్క ఘుమఘుమాయింపుమాత్రం ఘాటుగావుండి మాయిల్లంతా ఆవరించింది. ఈసౌరభానికి లీలయొక్కనిద్ర తెరలువిచ్చిపోతుందేమోనని నాభయం. అందుచేత ఆలస్యంగాకుండా తొందర తొందరగా కాఫీత్రాగేశాను, పెదవులూ, నాలుకా కొంచెం కాలుతున్నా ఓర్చుకుంటూ. కాళీగిన్నెలు అక్కడే వదలివేశాను. లీల నిద్రపోతూనేవుంది పాపం.

స్కూలునుంచిరాగానే విడిచి వంకెకుతగిలించిన కోటు మళ్లీధరించుకున్నా. అద్దంలోచూచుకుని తలగుడ్డ చుట్టుకున్నా. ఉపాధ్యాయవేషం పూర్తిఐంది. జాగ్రఫీపుస్తకం చేతపట్టుకుని స్కూలుకు వెళ్లబోతూ లీలనులేపి "స్కూలుకుపోతున్నాను. తలుపువేసుకో" అని చెప్పి వాకిలిగడప దాటేను. లీలలేచి గుమ్మం

దాకావచ్చింది. అక్కడేవున్నవిగా ఖాళీగిన్నెలన్నీ. చూచింది. మళ్లీ నావేపుచూచింది. ఆ మెముఖం చూస్తే కొద్దిగా కోపంవచ్చిందేమో ననుకున్నాను. మాట్లాడకుండా స్కూలుకువెళ్లేను.

లీలభాగంకూడా ఆనాడు నేనే త్రాగినందుచేత 'కాఫీడోసు' ఎక్కువై పాఠం బాగా నేచెప్పేను. పిల్లలెవరూ అల్లరిచేయకుండా విన్నారు. కాఫీఅంటే మంచివుద్రేకం కలిగించేవస్తువు సుమండీ!

* * *

మళ్లీమర్నాడు స్కూలు వదలిపెట్టినతర్వాత ఇంటికివచ్చాను మధ్యాహ్నం. రోజుకుమల్లేలేదు ఆనాటి వ్యవహారం. తలుపులు తెరచుకొనేవున్నవి. లీల నిద్ర పోవడంలేదు. హాల్లో పడక కుర్చీలో వయ్యారంగా పడుకుని ఊలుతో విసనకఱ్ఱ అల్లుతున్నది. నేనురాగానే మర్యాదార్థంగాలేచి నాకోసం కుర్చీఖాళీచేసి అక్కడనిల్చున్నది అల్లుతూన్న విసనకఱ్ఱ చేతుల్లో పట్టుకుని. ఆమెకన్నుల్లో నిద్రమత్తు కనుపించడములేదు. సహజమైనకాంతితో జ్యోతుల్లాగా మెరుస్తున్నవి. తెల్లనిచీర కట్టుకున్నది. అప్పుడే తలదువ్వుకుని అల్లుకున్న నల్లత్రాచులాంటి ఆపొడుగాటిజడ భుజముమీదుగా ముందరకు తీసుకున్నది. ఉన్నత వక్షంమీద నాట్యంచేస్తూ అదోసొగసుగావున్నది. సహజంగా అందమైనపిల్ల లీల. అందులో ఆయుస్తాబు మీద నాకళ్లు మెరిసిపోయి ఒక్కసారి ఈచేతుల్లో నులిమివేద్దామా అనిపించింది ఆసౌందర్యకుసుమాన్ని.

కాని ఏమీమాట్లాడకుండా గంభీరంగా కుర్చీలో పడుకున్నా. సహజంగా వాగుడుకత్తెఐనా లీలకూడా మౌనంతోనే వుంది. ఆమెవిశాలనేత్రాలలో నల్లగ్రుడ్లుచపలంగా అటూ ఇటూ పరుగెత్తుతున్నవి. చివరకు అక్కడ క్రిందపరచివున్న చిరిచాపమీద గోడ కానుకుని కూర్చున్నది.

"కూర్చుంటావేం. వేగిరం కాఫీచెయ్యి. స్కూలు వేళౌతున్నది".

"రోజూ మీరే చేసుకుంటున్నారుగా. ఇవ్వాళ నేనెందుకు?".

"అనవసరపువాదం పెంచక. చేస్తావా? చేయవా?".

"కోపపడకండి, పాలులేవివ్వాళ".

"ఎందుచేత?".

"ఇప్పుడే కాఫీచేసుకుని తాగేశాను."

చల్లారిన కుంపటీ, మసిపట్టిన ఒకగిన్నె ఆమూల నాకు కనుపించినవి. నిండా కోపంవచ్చిందినాకు. ఒళ్లంతా జలదరించింది.

"అయితే నామాట మరపువచ్చిందా నీకు.?"అని అడిగాను.

"నామాటమాత్రం మీకు జ్ఞాపకంవుందా నిన్న?"

"నేను స్కూల్లో వాగివాగి ఈపాటికివస్తానని ఎఱుగుదువుకదా! కాఫీఅంతా నీవేచేసుకుని త్రాగేస్తే ఏమనుకున్నావు?"

"ఇంట్లో చాకిరీచేసిచేసి అలసిపోయి వుంటాను గదా! నిన్నకాఫీఅంతా, ఒక్కచుక్కైనా నాకుమిగిల్చకుండా త్రాగేశారే ఏమిటో మీఅభిప్రాయం?"

"అభిప్రాయమేమిటి? నేను చేసుకున్నాను; త్రాగేశాను. నీవుచేశావా?"

"నేనుచేసుకొనేగా, నేనూ త్రాగేనూ!"

"తెలివితేటలు చూపించకు. నీవుచేసినపనిలో నీ నిర్లక్ష్యస్వభావం వెల్లడౌతున్నది."

"నిన్న మీరుచేసినపనిలో మీకు నామీదవున్న ప్రేమ వ్యక్తమౌతున్నది కాబోలు."

"సంతోషించాను. నోరుమూసుకో. చేసిన తప్పుకు పశ్చాత్తాపపడక సమర్థించుకో ప్రయత్నిస్తావెందుకు? చూస్తున్నానుకదా! రానురాను మాటల్లో, చేతల్లో, అన్నిట్లో నిర్లక్ష్యం కనుపిస్తూనేవుంది. అల్లాంటివేసాలు సాగవుసుమా! నేను సహించేవాణ్ణి గాదు." నాపెదవులదరినై. కనుబొమలు ముడిపడినై. కన్ను లెఱ్ఱబడ్డట్లుకూడా వున్నవి.

లీల చలించలేదు. ప్రశాంతంగావున్నది ముఖం. పెదవులమీద లేతనవ్వు కదలాడుతూనే వున్నది. దాన్నిచూచినకొద్దీ నాకోపం మఱింత ఎక్కువౌతున్నది. కాని లీలమాత్రం నాకోపానికి తానేమీ వెరవ

నట్లుగా నావేపే చూస్తున్నది నవ్వుతూ. నా కోపానికి భయపడి గడగడ లాడేటందుకు బడిపిల్లవాడైతేగా. చేసుకున్న భార్య. నేనుపంతులునైనా, నాకే పంతులమ్మగావుంది.

ఆకోపంమీద కుర్చీలోంచి చివాలునలేచి, దబదబా పెట్టెతీసి నాలుగు చిల్లరడబ్బులు జేబులోవేసుకుని పోబోతున్నాను. నావుద్దేశమేమంటే స్కూలుకు పోయేదారిలో అనేక కాఫీభవనాలు వున్నాయికదా, ఏదో ఒకదానిలోదూరి కప్పో, రెండు కప్పులో కాఫీ త్రాగి వెళ్లుదామని. కాఫీ లేకపోతే స్కూల్లో పాఠంచెప్పటం కష్టం. నాది అందులో కాఫీగతప్రాణం.

పోబోతున్నా. ఇంతలో లీలవచ్చి నా చేయిపట్టుకున్నది. "కాఫీ త్రాగి వెళ్లరూ?"

"ఏమిటి మరీచమత్కారంగావుంది నీ వేషం ఇవ్వాళ. పాలన్నీ కాఫీచేసికొని త్రాగేననవ్."

"మరి కాఫీలేకుండా నేవెళ్ళుతారా స్కూలుకు?"

"అయితే ఏమిచేయమంటావు?"

"ఏమీలేదు. అప్పుడే స్కూలువేళ కాలేదుగా. కాస్సేపు కూర్చొని వెళ్లండి."

"ఇంతవరకు చాల సంతోషించాను నీవేషానికి. ఇంకా ఏముంది?"

"రండి తెలుస్తుంది"అని కుర్చీవేపులాగటం మొదలెట్టింది. ఆమెలేతచేతిపట్టు విడిపించుకోలేకపోయాను. మొదలువచ్చినకోపంకూడా చాలవరకు తగ్గింది. పోనీ ఇంకా టైము కాలేదుకదా అని మళ్లీ కుర్చీలో దేహంవాల్చాను. లీల వంటయింట్లోకి పోయి మూతపెట్టివున్న ఒక గిన్నెతో ప్రత్యక్షమైంది. నేనలాచూస్తూ ఊరుకున్నాను. "ఏమిటదీ!" అనికూడా అడగలేదు. అంతా నాటకంలావుంది.

"ఐతే మీలాంటిదాన్నే నేనుకూడా అని తలుస్తున్నారుకాబోలు మీరు. మీరంటే నిన్న కాఫీఅంతా నాకులేకుండా తాగేయగలిగినారుకాని, నాకలా ప్రాణంవొప్పదు సుమండీ! హిందూస్త్రీకి భర్తే దైవం. అతన్నే ఎల్లప్పుడూ ఆరాధించుకుంటుంది. ఆయన చేత అనుభవింపబడని దేదిన్నీ ఆమెముట్టనేముట్టదు. నాధుని ఉచ్ఛిష్టమే ఆమెకు పంచభక్ష్యపరమాన్నాలు. మీదృష్టిలో నేనొకనీచురాలినిగా కనపడివుంటాను ఈరోజున. కాని అంత అభాగ్యురాలను కాదు. నన్నుమీరు బాగా గుర్తెఱుగకున్నందుకు నాకు దుఃఖంగావున్నది."

"పెద్దవుపన్యాసం చెప్పేవుకాని, హిందూ స్త్రీ భర్తచేత కాఫీచేయించుతుందా రోజూ?"

"అదేకాబోలు ఇవ్వాళమీకు నా మీద వచ్చిన కోపానికికారణం. సరదాగా మీరేచేసుకుంటున్నారనుకుంటున్నాను గాని నేనుచేయనన్నానా?"

"మగవాడికి వంటచేయడంకూడా సర్దేనా?"

"ఇంతకోపం మనసులో వుంచుకోకపోతే నాకు చెప్పివుండ గూడదూ? నాకు తెలియదయ్యో." ఈలోగా తాను తెచ్చిన గిన్నెలోంచి, సేమ్యాపాయసం ఒక పింగాణీగిన్నెలోపోసి నాకందిస్తూ చిర్నవ్వుతో "ఇకనుంచి నేనే కాఫీచేస్తుంటాను. మీరు కుంపటి ముట్టుకోనేవద్దు. నన్ను క్షమించండి"అంది.

ఇప్పటికి కోపమంతా చల్లారిపోయిందినాకు. పాయసం చప్పరిస్తూ "ఇవ్వాళ ఈఆహారంమీద మనసుపోయిందా నీకు?" అన్నాను.

లీల కుర్చీదగ్గర నిల్చుని శరీరలత కొంచెంవంచి నాకోటు 'కాలర్' తడుముతూ నాకళ్లల్లోకిచూస్తూ "క్షమించారా?" అంది. నవ్వుతూన్న నాకళ్లేప్రత్యుత్తరం చెప్పినై.

లీల శరీరమేకాదు, మనస్సుకూడా అందమైందనుమా అనుకున్నా. రెండుగిన్నెలపాయసం తాగేసి స్కూలుకు పోవడానికిలేచాను.

"ఇంతకూ మీకోపమంతా పోయిందా?" మధురంగా ప్రశ్నించింది లీల.

ప్రసన్నంగాచూస్తూ లీలను దగ్గరకు లాక్కున్నాను.

* * *

నాడుమొదలు ఈరోజువరకూ నా చేతిమీదుగా కాఫీచేసుకొని ఎఱుగను. ఎప్పుడైనా కాఫీలోపంచదార కలపటానికిగాని, చల్లారపోయడానికిగాని నేనువెళ్లితే "ఊరుకోండి. మీరు చేయిచేసుకోకండి" అంటుంది. పూర్వపు నిద్రమత్తంతా ఏమైందో?